క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలగనుంది. 33/11 సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన ఇందిరానగర్ 11 ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు జరగనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా పైడిమాంబ మారువారం పండగ



ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు డెయిరీ ఫారం జంక్షన్‌లో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. గత నెల 18 నుంచి 26 వరకు అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మారువారం పండగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. రవీంద్రనగర్, ఆదర్శనగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, డెయిరీ ఫారం, ఇందిరానగర్, తదితర ప్రాంతాల నుంచి సుమారు 3వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు. పండగ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన వివిధ గ్రామ సంఘాల నాయకులు, యువత, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ జాతర చాటింపు



అమ్మవారికి పసుపు,కుంకుమ తో ఊరేగింపు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో కొలువుదీరిన శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర చాటింపు కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పసుపు, కుంకుమను ఊరేగించారు. నరసింహనగర్‌లోని అమ్మవారి పుట్ట మన్ను వరకూ ఈ ఊరేగింపు సాగింది. అక్కడ అమ్మవారిని కొలువు తీర్చారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జాతర నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం



బైరు సూరమ్మ

మర్రిపాలెం: కంచరపాలెం బర్మాక్యాంప్‌లో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు ఇటీవల వచ్చిన బైరు సూరమ్మ(68) అనే వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల తెలిపిన వివరాలు..డి.లక్ష్మి అనే మహిళ కంచరపాలెం బర్మాక్యాంప్‌లో నివసిస్తోంది. ఈమె తల్లి బైరు సూరమ్మ(68) వేరే ఊరి నుంచి పదిరోజుల క్రితం ఆమె దగ్గరకు వచ్చింది. మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేదు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండుటాకులపై పగ

తూర్పులో వార్డుల వారీగా పింఛన్ల వివరాలు	వార్డు	లబ్ధిదారులు	14	780	20	774	మొత్తం 21,597
	9	974	15	1025	21	701	
	10	1534	16	1182	22	1220	
	11	2015	17	998	23	1247	
	12	1459	18	1235	27	1235	
	13	1909	19	1856	28	1453	

- టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రపై సర్వత్రా ఆగ్రహం
- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో తీవ్ర ఆవేదన
- డబ్బుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

బీచ్ రోడ్డు: ప్రతి నెలా ఒకటో తేదీ అయ్యేసరికి సూరీడు కంటే ముందే వచ్చి పలకరించే వలంటీర్లతో పింఛనర్లకు నిజంగానే శుభోదయం అయ్యేది. వేకువ జామునే పింఛన్ సొమ్ము చేతికందడంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరిసేది. మంచానికే పరిమితమైన రోగుల కళ్లు చెమ్మగిల్లేవి. నెలకు రూ.3 వేలు ఇంటికే రావడంతో కొండంత ఆర్థిక భరోసాగా భావించేవారు. కానీ ఎన్నికల బూచి చూపి గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే వచ్చిన సామాజిక పింఛన్‌ను రాకుండా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. గతంలో వలే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి ఎండాలో వేచి ఉండాల్సిన పరిస్థితి కల్పించాయని అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి కుట్రతో తమ పొట్ట కొట్టారని మండిపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నీచమైన బుద్ధి మరోసారి బయటపడిందని సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఛీదరించుకుంటున్నారు. ఐదేళ్ల పాటు ఎటువంటి ఇబ్బంది లేకుండా తీసుకున్న పింఛన్‌ను ఇప్పుడు ఇంత కఠినతరం చేస్తున్న కూటమి నాయకులు.. రేపు అధికారంలోకి వస్తే అసలు పింఛన్ ఇస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 21,597 మంది లబ్ధిదారులు ఈ నెల పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు.



సీతంపేటలో వార్డు కార్యాలయం వద్ద పింఛను కోసం వృద్ధుల పడిగాపులు (ఫైల్)

కోడికూతతో పెన్షన్ అందేది..



కోడికూతతోనే ఇంటికి వచ్చి వలంటీర్లు పెన్షన్ సొమ్ము చేతులో పెట్టేవారు. ఈ నెల వలంటీర్లు రాలేదు. మా పెన్షన్ ఎవరూ ఇస్తారో తెలియదు. అంతా అయోమయంగా ఉంది. ఎన్నికలకు వలంటీర్లకు సంబంధం ఏంటీ?. పెన్షన్ల పంపిణీకి అడ్డంకిగా మారిన టీడీపీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం. వికలాంగులు పెన్షన్ కోసం ఎక్కడికి తిరిగాలి. ఇలాంటి పనులు చేయడం చంద్రబాబుకు న్యాయమేనా?.

– మెగలపూరి విశ్వనాథం, లబ్ధిదారు, రజకవీధి ఇసుకతోట

చంద్రబాబుకు మానవత్వం లేదు



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి వలంటీర్ పింఛన్ డబ్బులు ఇస్తున్నారు.ఈ సారి డబ్బుల కోసం రెండురోజులుగా ఎదురుచూస్తున్నాను. ఎలక్షన్ల వల్ల వలంటీర్ ఇంటికి రాడు, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. పాత రోజులు గుర్తుకు వచ్చి భయమేస్తోంది. చంద్రబాబు టైంలో పింఛను పుస్తకం పట్టుకుని మండుటెండలో వార్డు ఆఫీసు వద్ద గంటల తరబడి లైన్‌లో పడిగాపులు కాసేదాన్ని. జగన్‌బాబు వచ్చాక ఆ పరిస్థితి పోయింది. గుమ్మం కదలకుండా ఇంటి వద్ద వలంటీర్ పింఛను డబ్బులు ఇస్తున్నాడు. పింఛను మీద ఆధారపడి జీవిస్తున్నాను. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ ఆపివేయడం దారుణం. మా లాంటి ముసలి వాళ్ల విషయంలో చంద్రబాబు రాజకీయాలు చేయడం న్యాయమేనా. కనీసం మానవత్వం లేదా. వృద్ధులను ఇబ్బంది పెట్టకుడా వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ ఇచ్చేలా చూడాలి.

– హసీనా బాను, ఎంటీసీపాలెం

వలంటీర్ కోసం ఎదురుచూపులు



ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 6 గంటలకే వలంటీర్ వచ్చి నాకు పింఛన్ ఇచ్చేవాడు. కానీ ఈ రోజు ఏమైందో తెలియడం లేదు. ఉదయం 10 గంటలు అవుతున్నా ఇంకా రాలేదు. వలంటీర్‌కు ఆరోగ్యం బాగాలేదేమో. లేకపోతే ఇంత ఆలస్యం ఎప్పుడు చేయలేదు.

–పి.రమణమ్మ, పింఛన్‌దారు, పోలమాంబ ఆలయం వీధి

సచివాలయంకు ఎలా వెళ్లగలను?



పింఛన్ కోసం ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోమంటున్నారు. నేను దివ్యాంగుడిని. సచివాలయానికి ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు. తీరా అక్కడికి వెళ్లినా ఆ రద్దీలో నిల్చొని పింఛన్ తీసుకోవడం చాలా కష్టం. నా ఆరోగ్యం కూడా సరిగ్గా లేదు. ఎప్పటిలాగే మా వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇవ్వాలి.

–డి.అప్పల రాజు, దివ్యాంగ పింఛన్‌దారుడు, శివాజీపాలెం

ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించారు..



నా పేరు మేరుగు అప్పన్న. మేము ఉండేది విశాఖ జిల్లా మంగమారిపేట. నేను కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో వున్నప్పుడు ఒకటో తేదీన వలంటీర్ నేరుగా నగరంలో ఉన్న ఆస్పత్రికి వచ్చి పెన్షన్ అందించారు. ప్రస్తుతం నాకు డయాలిసిస్ జరుగుతోంది. ఎక్కడకూ వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నాను. నా ఇద్దరు కొడుకులు ఉద్యోగ రీత్యా వైజాగ్‌లో స్థిరపడ్డారు. ఇలాంటి సమయంలో నేను సచివాలయానికి వెళ్లి పెన్షన్ తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నాను. రాజకీయ లబ్ధి కోసం సామాన్య ప్రజలను ప్రతిపక్షాలు ఇబ్బందులు పెట్టడం దారుణం.

– మేరుగు అప్పన్న, పింఛనుదారు

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం మంగళవారం 17వ వార్డులో జోరుగా కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ 79వ రోజు 17వ వార్డు సెక్టార్–4లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని ఎంవీవీ కోరారు. తనతో పాటు పార్టీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంతో పాటు విశాఖపట్నం అభివృద్ధి వేగంగా జరుగుతుందనే విషయాన్ని ప్రతి ఓటరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మహిళకు పథకాల కోసం వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ముస్లింలకు నిత్యావసర సరకుల పంపిణీ

ఎంవీపీ కాలనీ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు(మహ్మద్ ఇబ్రహీం) ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పేరిట నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 17వ వార్డులో ఈ జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మహిళలు పాల్గొని బియ్యం బ్యాగులతో పాటు పలు నిత్యావసర సరకులు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ ముస్లిలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. రాష్ట్రంలోని ముస్లింలకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ సర్కారు నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ ప్రాధాన్యం కల్పించి ముస్లింలకు అండగా నిలిచిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముస్లింలు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ ప్రతినిధి కడిత రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మార్కండేయులు, తదితరులు

ఒంటి పూట బడులపై అధికారులు దృష్టిసారించాలి

ఎంవీపీ కాలనీ: పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఒంటిపూట బడుల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 25 జిల్లాల అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఒంటిపూట బడులు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా కొన్ని యాజమాన్యాలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మధ్యాహ్నం తరువాత విద్యార్థులతో తిరిగే స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రవాణా శాఖ సైతం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

‘కార్మికులపై చిన్నచూపు సరికాదు’

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కార్మికులు శ్రమ ఎనలేనిదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి కార్మికులను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1146వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సింటర్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికవర్గం ఎంతగానో శ్రమించారన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థలోని కార్మికులు పాల్గొన్నారు.



1146వ రోజు ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కు పరిరక్షణ పోరాటానికి మూడేళ్లు

సీతంపేట : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న ప్రధాని మోదీ, బీజేపీకి సహకరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నాయకులు కార్మిక వర్గానికి, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం ఏప్రిల్ 2 నాటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట కమిటీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు, జేఏసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టినా మోదీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఏప్రిల్ 2న జీవీఎంసీ వద్ద దీక్షా శిబిరం ప్రారంభించామన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నిలబడే పార్టీలను రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు.

మీ ఓటే మీ భవిష్యత్

వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



సిద్ధం సభలో ఫ్యాన్ గుర్తును చూపిస్తూ మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ



సిద్ధం సభలో ప్రజలు

ఆరిలోవ: మీ ఓటుతో మీ భవిష్యత్తును కాపాడుకోవాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రజలకు సూచించారు. జీవీఎంసీ 11వ వార్డు పరిధి స్వామి వివేకానందనగర్‌లో మంగళవారం మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు వలంటీర్ల ద్వారా పంపిణీ జరగకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి అడ్డుకున్నారన్నారు. అవ్వా, తాతలు ఇంటి వద్దే ఉండి పింఛను తీసుకొనే విధానం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. దీన్ని చంద్రబాబు అడ్డుకొని వృద్ధులను బాధపెడుతున్నారని 58 నెలలు పాటు ఇంటికి వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చారన్నారు. ఇప్పుడు చంద్రబాబు ఆటంకం కలిగించడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తొలగించడానికి చూస్తున్నారని ఎంవీవీ ఆరోపించారు. అందుకే ఆయనను నమ్మవద్దని కోరారు. నేర చరిత్ర కలిగిన వెలగపూడి రామకృష్ణబాబుకు ఈ సారి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నగరాల డైరెక్టర్ కె.మోహనరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాహనాలు దగ్ధం



దగ్ధమైన కారు ఇంజిన్ భాగం

ఎంవీపీ కాలనీ: లాసన్స్‌బే కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు రెచ్చిపోయారు. పలు వాహనాలను దగ్ధం చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లాసన్స్ బే కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. ఒక ఎకో స్పోర్ట్స్ కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం కాగా కారు ఇంజిన్ పాడైందన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పరవాడ: లంకెలపాలెం–సబ్బవరం రహదారిలో మంగళవారం ఉదయం మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటనలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సహదీప్(52) అనే వ్యక్తి మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఆయనను వెనక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనచోదకుడు బలంగా ఢీకొట్టాడు. సహదీప్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు స్మైలెక్స్ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు.

సమస్యలు చెప్పండి.. అన్నీ పరిష్కరిస్తాం

- సమస్యల రహిత హాస్టళ్లే లక్ష్యం
- ఏయూ అధికారుల హామీ
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థినులు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఏయూ ఇంజనీర్ శంకరరావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు

విశాఖ సిటీ: ఏయూ హాస్టళ్లను సమస్యల రహితంగా తీర్చిదిద్దుతామని ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు విద్యార్థినులకు హామీ ఇచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వర్సిటీ పరిపాలన భవనానికి ప్రిన్సిపాల్ శశిభూషణ్‌రావుకు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్.. ‘మీ సమస్యలు చెప్పండి.. దానికి ఏం చేయాలో కూడా చెప్పండి.. తప్పకుండా అన్నీ పరిష్కరిస్తాం..’అంటూ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూలో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి హాస్టల్‌ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని, టాయిలెట్స్ మార్పు చేశామన్నారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రోద్బలంతోనో ఇటువంటి నిరసనలు చేపట్టవద్దన్నారు. మిమ్మల్ని ఎవరైనా వెనకుండి చెయ్యమన్నారా? అని ప్రశ్నించగా, ఓ మీడియా సంస్థ పేరు చెప్పడం ఓఎస్‌డీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అధికారుల సత్వర స్పందన

వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు వెంటనే విద్యార్థినుల హాస్టళ్లను ఆచార్యులతో కలిసి పరిశీలించారు. హాస్టళ్లలో టాయిలెట్స్ నిర్వహణ, అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సిన పనులను గుర్తించారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల 3.10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్‌పీ ఎస్ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల 3.10 గ్రాముల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శాంతారాం తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.